
సాక్షి
పల్నాడు
మంగళవారం : 9 : జనవరి : 2024



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం
ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో జరిగే నిత్యాన్నదానానికి కానూరుకు చెందిన హరి మంజూష్, వేదశ్రీ సోమవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



జనరిక్ దుకాణానికి కోడ్
తాడికొండ: తాడికొండ పీఏసీఎస్ తరఫున జనరిక్ మెడికల్ షాపు లైసెన్సు, స్టోర్ కోడ్ పత్రాన్ని ఢిల్లీలో నిర్వహించిన సదస్సులో సొసైటీ చైర్మన్ షేక్ నగీనా సోమవారం అందుకున్నారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 522.80 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 4,894, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్


రేపు ఇండో-ఇజ్రాయేలు ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన
నరసరావుపేట: ఇండో–ఇజ్రాయేలు ప్రాజెక్ట్‌లో భాగంగా సత్తెనపల్లి నియోజకవర్గం నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలోని బాలాజీనగర్ తండా వద్ద 25.57ఎకరాల ప్రభుత్వ స్థలంలో రూ.10కోట్లతో ఏర్పాటుచేసే సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రానికి ఈనెల 10 బుధవారం ఉదయం 10 గంటలకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి బీజే బెన్నీ సోమవారం వెల్లడించారు. ఈ కేంద్రంలో మిరప, కూరగాయలైన టమాటో, చెర్రీ టమాటో, దోస, వంగ, క్యాప్సికం, ఇతర కూరగాయలపై పరిశోధనలు నిర్వహించి మేలైన వంగడాలు షేడ్ నెట్ ద్వారా పెంచి రైతులకు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. శంకుస్థాపనకు వ్యవసాయ, జలవనరుల శాఖ మంత్రులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఉద్యాన శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.ఎస్ శ్రీధర్, పాల్గొంటారన్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.11.81లక్షలు
దుర్గి: అడిగొప్పలలోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ.11,81,708 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీగిరిరాజు నరసింహ బాబు తెలిపారు. సోమవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కారంపూడి గ్రూప్ టెంపుల్స్ కార్యానిర్వాహణాధికారి కృష్ణంరాజు ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ లెక్కింపు చేపట్టారు. కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేసి సంబంధిత రసీదును తీసుకున్నట్లు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో కారంపూడి గ్రూప్ టెంపుల్స్ ఈఓ వప్పుల కృష్ణంరాజు, కరాలపాటి సుబ్బారావు, కలవల వెంకటేశ్వర్లు, ఎస్ఎంఆర్ సిబ్బంది, అర్చక, పరిచారక, నాయీ బ్రాహ్మణులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

యార్డుకు 70,720 బస్తాల మిర్చి
కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 70,720 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 65,591 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 23,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,500 నుంచి రూ.20,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 22,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 37,755 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

రేపు ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక
బాపట్ల: ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జూనియర్ బాలురబాలికల జట్టు ఎంపిక ఈనెల 10న మున్సిపల్ హైస్కూలులో నిర్వహిస్తున్నట్లు పీడీ కత్తి శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన వారు ఈనెల 20 నుంచి 24 వరకు నంద్యాల్లో జరిగే అంతర్ జిల్లా పోటీలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 5-2-2003 తరువాత పుట్టిన వారై ఉండాలని తెలిపారు. బాలురు 70కేజీల్లోపు, బాలికల బరువు 65కేజీల్లోపు ఉండాలని సూచించారు.

నంది నాటకోత్సవాల నిర్వహణ అద్భుతం: జేసీ



గుంటూరువెస్ట్: స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గత నెలలో నంది నాటకోత్సవాల్ని జిల్లా యంత్రాంగం సమష్టిగా అద్భుత రీతిలో నిర్వహించిందని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి ప్రశంసించారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం అధికారులకు, సిబ్బందికి ఆమె జ్ఞాపికలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ నాటక రంగానికి ఆదరణ ఉందని నాటకోత్సవాలు నిరూపించాయని తెలిపారు. ముఖ్యంగా యువతరం కూడా ఎంతో మక్కువ చూపించిందని పేర్కొన్నారు. ప్రతి విభాగంలోనూ అధికారులు చక్కని సమన్వ యం కనబరిచారని కొనియాడారు. డీఆర్వో చంద్రశేఖర రావు, ఐ అండ్ పీఆర్ డెప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రఫీక్, డీఎస్‌వో కోమలి పద్మ, ఉప రవాణా అధికారి షేక్ కరీంతోపాటు అధికారులకు ఆమె జ్ఞాపికలు అందజేశారు. ఆర్డీవో పి.శ్రీకర్, డెప్యూటీ కలెక్టర్ కె.స్వాతి పాల్గొన్నారు.

విద్యుత్ సేవలు మరింత చేరువ



- సచివాలయాల్లోనే 14 రకాల సేవలు
- విద్యుత్ మీటర్ నుంచి బిల్లుల చెల్లింపు వరకు
- ట్రాన్స్‌కో, వినియోగదారులకు వారధిగా ఎనర్జీ అసిస్టెంట్లు
- పల్నాడు జిల్లాలో 269 మంది ఎనర్జీ అసిస్టెంట్లు
- త్వరితగతిన విద్యుత్ సమస్యల పరిష్కారం

సత్తెనపల్లి: గ్రామ, వార్డు సచివాలయాల్లో విద్యుత్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటి వరకు విద్యుత్ బిల్లుల చెల్లింపుతో పాటు పలు విద్యుత్ సేవలను పొందేందుకు వినియోగదారులు విద్యుత్ సబ్‌స్టేషన్‌లు, సెక్షన్ ఆఫీసులు, మీసేవ కేంద్రాలను ఆశ్రయించేవారు. ఈ కష్టాలను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వార్డు, గ్రామ సచివాలయాల్లో 14 రకాల విద్యుత్ సేవలు పొందేలా చర్యలు చేపట్టింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో విద్యుత్ సేవలను సులభతరం చేసింది. పల్నాడు జిల్లాలోని 28 మండలాల పరిధిలో 122 వార్డు, 416 గ్రామ సచివాలయాలు కలపి 530 సచివాలయాలు ఉన్నాయి. వివిధ విద్యుత్ సమస్యలపై విద్యుత్ సబ్‌స్టేషన్‌లు, మీసేవ కేంద్రాల చుట్టూ తిరగకుండా గ్రామ, వార్డు సచివాలయాల్లో సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ కష్టాలకు చెక్

గతంలో పలు రకాల విద్యుత్ సేవలు పొందేందుకు వినియోగదారులు అష్ట కష్టాలు పడే వారు. విద్యుత్ సబ్‌స్టేషన్, విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్ ఆఫీసులు, మీసేవ కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. సమస్యల పరిష్కారం కోసం రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. ఆ సమస్యలకు చెక్ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సేవలను సైతం గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుబాటులోకి తెచ్చింది. పట్టణ ప్రాంతాల్లో 13 రకాల విద్యుత్ సేవలతోపాటు పల్లెల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపును కూడా గ్రామ సచివాలయాలకు అనుసంధానం చేసింది. వినియోగదారులు, విద్యుత్ సంస్థకు మధ్య వారధిగా ఎనర్జీ అసిస్టెంట్లు (గ్రేడ్–2 జేఎల్ఎం) కీలకపాత్ర పోషిస్తున్నారు. పట్టణాలు, గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. పల్నాడు జిల్లా పరిధిలోని 28 మండలాల్లో 269 మంది ఎనర్జీ అసిస్టెంట్లు వినియోగదారులకు సేవలు అందిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లకు కొన్ని విద్యుత్ సర్వీసులకు సంబంధించి బాధ్యతలు అప్పగించారు. వీరు వినియోగదారులకు నిత్యం అందుబాటులో ఉంటూ 5–10 కిలోమీటర్ల దూరంలో ఉన్న విద్యుత్ లైన్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విద్యుత్తు లైన్‌లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, విద్యుత్ జంపర్లు తెగిన సమయంలో వాటిని పునరుద్ధరించడం, ట్రాన్స్‌ఫార్మర్లలో తలెత్తిన సమస్యలు పరిష్కరించడం, ఆగిపోయిన, కాలిపోయిన మీటర్ల స్థానంలో కొత్త మీటర్లు ఏర్పాటు తదితర సేవలు అందిస్తున్నారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలపై వినియోగదారులు, వలంటీర్లు సచివాలయంలో ఫిర్యాదు చేస్తే అతి తక్కువ వ్యవధిలో సమస్యను గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

సేవలను వినియోగించుకోండి



గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుతున్న 14 రకాల విద్యుత్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి. గృహ, వ్యవసాయ విద్యుత్ మీటర్లు, విద్యుత్ బిల్లులు, ఇతర విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేస్తే ఎనర్జీ అసిస్టెంట్లు త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

–ఎస్ శ్రీనివాసరావు, డీఈ, నరసరావుపేట

సచివాలయాల్లో అందే విద్యుత్ సేవలు

- గృహ, వాణిజ్య విద్యుత్ సర్వీస్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
- వ్యవసాయ విద్యుత్ సర్వీసు కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
- విద్యుత్ సర్వీసుల్లో ఉన్న కేటగిరీలను మార్పు చేసుకునే సౌకర్యం.
- విద్యుత్ సర్వీస్ కోసం పేరు మార్చుకునే సౌకర్యం.
- అదనపు విద్యుత్ లోడు కోసం దరఖాస్తు అందజేయవచ్చు.
- మీటరు అధికంగా తిరుగుతుంటే టెస్టింగ్ చేసుకునే సౌకర్యం.
- కాలిపోయిన విద్యుత్ మీటర్ స్థానంలో కొత్త దానికి దరఖాస్తు.
- విద్యుత్ బిల్లులో వచ్చిన సమస్యలపై ఫిర్యాదు చేసుకునే సౌకర్యం.
- ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన ఫిర్యాదులు తెలియజేయవచ్చు.
- హై, లో వోల్టేజి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు.
- విద్యుత్ లైన్‌లు మార్చడం కోసం ఫిర్యాదు చేసే సౌకర్యం.
- శిథిలావస్థకు చేరుకున్న స్తంభాలను మార్చేందుకు ఫిర్యాదు చేయవచ్చు.
- విద్యుత్ మీటర్ ఆగిపోవడం, నెమ్మదిగా తిరగడం, వేగంగా తిరగడం వంటి సమస్యలను తెలియజేయవచ్చు.
- గ్రామాల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపులు సౌకర్యం.

పులిచింతల నిర్వాసితులకు శాశ్వత హక్కు



రిజిస్ట్రేషన్ పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి అంబటి రాంబాబు

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- రాజుపాలెంలో రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ
- 18 ఏళ్ల నిరీక్షణకు పరిష్కారం
- 5376 కుటుంబాలకు లబ్ధి

రాజుపాలెం: దేశ సౌభాగ్యం కోసం నిర్మించే సాగునీటి ప్రాజెక్టులలో నిర్వాసితులదే ముఖ్య భాగస్వామ్యమని, వారికి ప్రభుత్వాలు అన్ని సౌకర్యాలు కల్పించిన నివేశ స్థలాలపై పూర్తి హక్కు కల్పించడమే కీలకమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. రాజుపాలెంలోని పులిచింతల నిర్వాసిత కేంద్రంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను మంత్రి అంబటి రాంబాబు, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌లు సోమవారం అందజేశారు. సమావేశానికి పులిచింతల డిప్యూటీ కలెక్టర్ వసంతబాబు అధ్యక్షత వహించారు. అంబటి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆలోచనలతో పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం పురుడు పోసుకుందన్నారు. రిజర్వాయర్ నిర్మాణ సమయంలో మునిగిపోయిన గ్రామాల ప్రజలు 5376 కుటుంబాలకు రాజుపాలెం, పెదకూరపాడు, బెల్లంకొండ, పిడుగురాళ్ల మండలాల్లో నివాసాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. వీరందరికి గతంలో ఎంజాయిమెంట్ ధ్రువీకరణ పత్రాలను మాత్రమే అందించారని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ దస్తావేజులు ఇవ్వాలని ప్రభుత్వాలను వేడుకున్నా ఇప్పటి వరకు ఫలితం లేదని అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వీరందరికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి దస్తావేజులు ఇవ్వాలని నిర్ణయించారని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వంపై రూ.53 కోట్లు భారం పడుతుందని, అయినా పేద ప్రజలకు ఉచితంగా శాశ్వత హక్కు పత్రాలను అందించాలనే లక్ష్యంతో సీఎం జగనన్న జీఓ తెచ్చారని తెలిపారు. నిర్వాసితులు 18 ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమస్య నేటితో తీరిపోయిందన్నారు. ఈ ప్రభుత్వం ద్వారా మీకు మేలు జరిగిందని నమ్మి విశ్వసిస్తేనే మాకు ఓట్లు వేసి నాకు, జగనన్నను అండగా ఉండాలని అభ్యర్థించారు. జేసీ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ సమయంలో ఏ అధికారి అయినా డబ్బులు అడిగితే నాకు వెంటనే ఫోన్ చేయాలని నిర్వాసితులకు సూచించారు. 50 మంది నిర్వాసితులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బాసులింగా రెడ్డి, పక్కాల సూరిబాబు, తోట మోహన్‌రావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, సర్పంచ్ పులిబండ్ల అశోక్, ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు, జీడీసీఎంసీ డైరెక్టర్ పి.ఆదినారాయణ, డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు, ఆర్డీఓ రాజకుమారి, తహసీల్దార్ నళిని, ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, ఎంఈఓ మల్లికార్జునశర్మ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.2500, గరిష్ఠ ధర రూ.3500, మోడల్ ధర రూ.3000 వరకు పలికింది.

కొండమంజులూరుకు క్రికెట్ ఫీవర్

- పానెం హనిమిరెడ్డీస్ జాతీయస్థాయి క్రికెట్ టోర్నీకి సిద్ధం
- గ్రామంలో తొలిసారి నిర్వహణ
- పోటీల్లో పాల్గొననున్న రంజీ, ఐపీఎల్ క్రీడాకారులు
- నేడు ప్రారంభించనున్న సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి
- 16వ తేదీ వరకు వైభవంగా పోటీలు



క్రికెట్ పోటీలకు సిద్ధమైన క్రీడా ప్రాంగణం

జే.పంగులూరు: ఆటలు మానసిక దృఢత్వానికే కాదు.. ఐకమత్యానికి కూడా దోహదపడతాయనడంలో సందేహం లేదు. అందునా సంక్రాంతి పండగ సమయాల్లో అయితే మరీనూ. ఎక్కడెక్కడో ఉన్న వాళ్లంతా సొంతూరుకు వచ్చి ఆటలు ఆడుతుంటే ఆనందమే వేరు కదా. పంగులూరు మండలానికి క్రీడల విషయంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. పంగులూరు గ్రామం అంటే ఖోఖోకు ప్రత్యేక స్థానం. ఇక్కడి జూనియర్ కళాశాలలో జాతీయ ఖోఖో పోటీల్ని నిర్వహించారు. అదే స్థాయిలో మండలంలోని కొండమంజులూరులో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు క్లబ్ నిర్వాహకులు. గ్రామంలో 1995లో కొండమంజులూరు క్రికెట్ క్లబ్ ఏర్పడింది. అప్పటి నుంచి సంక్రాంతి సందర్భంగా 26 ఏళ్లుగా రాష్ట్రస్థాయిలో, రెండేళ్ల నుంచి దక్షిణ భారతదేశ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది తొలిసారిగా 29వ సారి జాతీయస్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. పోటీల్ని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి మంగళవారం ప్రారంభిస్తారు. వ్యయప్రయాసలకు ఓర్చి ప్రతిష్టాత్మకంగా టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, ఐపీఎల్, రంజీ ట్రోఫీ ఆటగాళ్లు కూ డా ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

వారం రోజుల పాటు క్రీడా సందడి

గ్రామంలో జనవరి 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ పోటీల కోసం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని రెడీ చేశారు. పిచ్, అవుట్ ఫీల్డ్ అంతా సిద్ధం చేశారు. ఇప్పటికే ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, ఉత్తరప్రదేశ్, జమ్మూకశ్మీర్, జార్ఖండ్, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి టీములు కూడా వచ్చాయి.

చీర్‌గాల్స్, డీజే సౌండ్స్‌తో ఉత్సాహం

మ్యాచ్ సమయంలో క్రీడాకారుల్ని ప్రోత్సహించేందుకు ఐపీఎల్ తరహాలో చీర్‌గాల్స్, డీజే సౌండ్స్, తీన్‌మార్ ఏర్పాటు చేశారు. క్రీడాకారులకు భోజన సదుపాయం, వసతితో పాటు ఆటలో ప్రతిభ కనబరిచిన ప్రతి క్రీడాకారుడికి ప్రోత్సాహక బహుమతులు అందించనున్నారు.

భారీ నజరానా

- టోర్నమెంట్‌లో మొదటి బహుమతి రూ. 6 లక్షలను వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి అందిస్తున్నారు.
- రెండో బహుమతి రూ. 4 లక్షలను వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ బి.వి. కృష్ణారెడ్డి అందిస్తున్నారు.
- మూడో బహుమతి రూ.2 లక్షలను కొండమంజులూరు క్రికెట్ క్లబ్ చైర్మన్ కరణం స్వామి అందిస్తున్నారు.
- ప్రతి స్థానానికి క్రికెట్ క్లబ్, గ్రామస్తుల సహకారంతో షీల్డ్ అందించనున్నారు.

గ్రామస్తులు, దాతల సహకారంతో పోటీల నిర్వహణ



గ్రామస్తులు, దాతల సహకారంతో గత 29 సంవత్సరాలుగా కొండమంజులూరు గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది మొట్టమొదటిసారిగా జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం సంతోషంగా ఉంది. ఈ టోర్నమెంట్ వల్ల మా గ్రామానికి మంచిపేరు వస్తుంది.

– కరణం స్వామి, కొండమంజులూరు క్రికెట్ క్లబ్ చైర్మన్

బహుమతులు గతం కంటే ఎక్కువ



ఈసారి జాతీయ స్థాయిలో టోర్నమెంట్ నిర్వహిస్తున్నాం. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి క్రీడా ప్రాంగణాన్ని కూడా నాణ్యత ప్రమాణాలతో ఏర్పాటు చేశాం. గెలుపొందిన వారికి భారీగా ప్రోత్సాహక బహుమతులు అందించనున్నాం. మ్యాచ్‌లను చూడటానికి అందరినీ ఆహ్వానిస్తున్నాం.

– బొప్పూడి వెంకన్నబాబు, క్రికెట్ క్లబ్ సెక్రటరీ

గిరిజనుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

- తలసేమియా బాధితులకు అండగా వైఎస్సార్ సీపీ
- ప్రభుత్వ విప్ పీఆర్కే



గిరిజన నేతలకు రూ.10 లక్షల నమూనా చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

దుర్గి: రాష్ట్రంలో గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా వేలాది రోగాలకు పూర్తిస్థాయి కార్పొరేట్ వైద్యం అందించటమే కాకుండా వారు పూర్తిగా నయమై ఆరోగ్యంగా ఇంటికి వెళ్లారా లేదాని విచారిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ముటుకూరు గ్రామానికి చెందిన మాచర్ల హెప్సిబా తలసేమియా బాధితురాలకు రూ.10వేల పెన్షన్ సోమవారం అందజేశారు. అనంతరం మండలంలో జరిగిన పింఛన్ అందజేత సభ కార్యక్రమంలో మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద వర్గాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. గిరిజనుల సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేశారన్నారు. భూమి లేని నిరుపేదలకు లక్షలాది ఎకరాలకు వారికి కేటాయించారన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సాగర్ కుడికాలువకు నీటి విడుదల



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువకు సోమవారం కృష్ణానది యాజమాన్య బోర్డు సభ్యుడు అజయ్‌కుమార్‌గుప్తా పర్యవేక్షణలో నీటిని విడుదల చేశారు. కుడికాలువ 5, 7వ గేటు ద్వారా గేటుకు 2,500 క్యూసెక్కుల చొప్పున రెండు గేట్ల ద్వారా 5వేల క్యూసెక్కులు నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ మురళీధర్‌రెడ్డి, కృష్ణానది యాజమాన్య బోర్డు సభ్యుడు అజయ్‌కుమార్ గుప్తా పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. సీఈ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ తాగునీటి అవసరాల నిమిత్తం ఐదు టీఎంసీల నీటిని రోజుకు ఐదు వేల క్యూసెక్కుల చొప్పున 11 రోజులపాటు విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణానది యాజమాన్య బోర్డు ఈఈలు రఘునందనరావు, శివశంకర్, లింగంగుంట్ల సర్కిల్ ఎస్ఈ వరలక్ష్మి, సాగర్ ప్రాజెక్టు ఈఈ శ్రీహరి, డీఈలు మురళీధర్, వెంకటసుబ్బయ్య, జేఈలు బాబుమియా, భారతి, సాగర్ ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

దీర్ఘాయుష్మాన్‌భవ

- గుంటూరు జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యం
- నెఫ్రాలజీ విభాగంలో అత్యుత్త వైద్యసేవలు
- ఉచితంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు
- హెచ్‌ఐవీ బాధితులకు సైతం ఉచితంగా డయాలసిస్



ఆధునిక డయాలసిస్‌ను ప్రారంభిస్తున్న నాట్కో ట్రస్ట్ చైర్మన్ నన్నపనేని

గుంటూరుమెడికల్:పేద కిడ్నీ రోగులకు గుంటూరు జీజీహెచ్ వరంగా మారింది. ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలు అందుతున్నాయి. కిడ్నీ మార్పిడి ఆపరేషన్లతో పాటు హెచ్‌ఐవీ, ఇన్‌ఫెక్షన్లు ఉన్న వారికి కూడా ఉచితంగా డయాలసిస్ అందిస్తున్నారు. ఉత్తమ వైద్యసేవలు అందుతుండటంతో ఏడు జిల్లాలకు చెందిన రోగులు ఇక్కడకు వచ్చి చికిత్స పొందుతున్నారు.

24 గంటలు ఉచిత వైద్యసేవలు

జీజీహెచ్‌లో ప్రతి బుధవారం, శనివారం 18వ నంబర్ గదిలో నెఫ్రాలజీ వైద్య విభాగంలో ఓపీ రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవల్ని అందిస్తున్నారు. సుమారు 100 నుంచి 150 మంది వరకు వారంలో చికిత్స కోసం వస్తున్నారు. ఓపీలో పరీక్షలు చేసిన తరువాత అడ్మిషన్ అవసరమైన వారిని 218 నంబర్ గదిలోని నెఫ్రాలజీ వార్డులో అడ్మిట్ చేసుకుంటారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గొంది శివరామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ మొహమ్మద్ అస్లాం, డాక్టర్ నిహారిక వైద్య విభాగంలో సేవల్ని అందిస్తున్నారు.

కిడ్నీ మార్పిడి ఆపరేషన్లలో రికార్డు

హెచ్‌ఐవీ, హెచ్‌సీవీ, ఇతర ఇన్‌ఫెక్షన్లు సోకిన కిడ్నీ రోగులకు సైతం ప్రత్యేకంగా డయాలసిస్ వైద్యపరికరాలు ఏర్పాటు చేసి ఉచిత వైద్యసేవల్ని అందిస్తున్నారు. నెఫ్రోప్లస్ సంస్థ పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్ షిప్ విధానంలో డయాలసిస్ మెషిన్లు ఏర్పాటు చేసింది. ఆస్పత్రి అధికారులు సైతం నెఫ్రాలజీ వార్డులో డయాలసిస్ మెషిన్లు ఏర్పాటు చేశారు. డయాలసిస్ చేయించుకుంటున్న వారిలో అవసరమైన వారికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తున్నారు. రోగి కుటుంబ సభ్యులు కిడ్నీలు దానం చేయడంతో ఇప్పటి వరకు 23 మందికి ఉచితంగా విజయవంతంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేసి వైద్యులు రికార్డు సృష్టించారు.

నాట్కో సహకారంతో నూతన డయాలసిస్ యూనిట్

కిడ్నీ రోగులకు కార్పొరేట్ వైద్యసేవలు ఉచితంగా అందించాలనే సదాశయంతో నాట్కో నెఫ్రాలజీ వార్డులో గత ఏడాది అక్టోబర్‌లో రూ.20లక్షలతో ఎనిమిది పడకలతో డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఎంతో మంది రోగులు నేడు ఉచితంగా డయాలసిస్ వైద్యసేవలు పొందుతున్నారు.

మూడేళ్లలో ఓపీలో చికిత్స పొందిన వారి వివరాలు	
2020	1,422
2021	6,94
2022	1,269
2023	1,468

క్లుప్తంగా

భవన నిర్మాణ కార్మికులకు విదేశాలలో ఉద్యోగాలు

నరసరావుపేట ఈస్ట్: భవన నిర్మాణ రంగంలోని కార్మికులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు సోమవారం తెలిపారు. కార్మికులకు ప్లాస్టరింగ్, సిరామిక్ టైలింగ్, బిల్డింగ్ ఫ్లోర్‌వర్క్, ఐరన్ బెండింగ్ వంటి విభాగాలలో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్టు వివరించారు. కనీసం 8వతరగతి చదివి ఇంగ్లిష్ భాషపై అవగాహన కలిగి 21నుంచి 45సంవత్సరాల లోపు వయస్సు కలిగి భవన నిర్మాణ రంగంలో 3సంవత్సరాల అనుభవం కలిగిన వారు అర్హులని తెలిపారు. మొదటి వీసా, వర్క్ పర్మిట్ క్యాలెండర్ సంవత్సరం ముగిసే వరకు ఉంటుందనీ, గరిష్ఠంగా 63నెలల వరకు పొడిగింపు చేస్తారని తెలిపారు. నెలకు భారతీయ కరెన్సీలో రూ.1.37లక్షలు చెల్లిస్తారని, దీనిలో మెడికల్ ఇన్సూ్యరెన్స్, ఇజ్రాయిల్ దేశం చట్టం ప్రకారం పన్ను మినహాయింపు, వసతి భత్యం తీసివేస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు 9988853335 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జనరిక్ దుకాణాలకు అనుమతి పత్రాల స్వీకరణ



శావల్యాపురం: మండలంలోని కారుమంచి, శావల్యాపురం, వేల్పూరు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం సౌజన్యంతో వ్యవసాయ పరపతి సంఘాలకు నూతనంగా జనరిక్ మందుల దుకాణాలు మంజూరయ్యాయి. సోమవారం ఢిల్లీలోని విజయ్ భవన్‌లో జరిగిన సదస్సులో జనరిక్ మందుల దుకాణాలకు సంబంధించి కోడ్ అనుమతులను సొసైటీ చైర్మన్లు అందుకున్నారు. కార్యక్రమంలో చైర్మన్లు నాగులపాటి చెన్నయ్య, బొల్లా వెంకట సాంబశివరావు, సీతవోలు జాలాది నాగప్రసాదు, వైవీ నారాయణ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్లాలి

డీపీఎం అమలకుమారి



మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేటరూరల్: ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రతి రైతు కృషి చేయాలని ప్రకృతి వ్యవసాయం డీపీఎం కె.అమలకుమారి అన్నారు. ప్రకృతి వ్యవసాయం కార్యాచరణ ప్రణాళిక-24పై సోమవారం నరసరావుపేట మండల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అమలకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల, రొంపిచర్ల, నరసరావుపేట మండలాల్లోని 22 గ్రామాల్లో 6,191 ఎకరాల్లో ఏ గ్రేడ్, ఏటీఎం మోడల్స్ సాగుచేస్తున్నట్టు తెలిపారు. తొమ్మిది సార్వత్రిక సూత్రాలను ప్రతి రైతు తమ పొలంలో అమలు చేయాలని సూచించారు. భూమిని 365 రోజులు కప్పి ఉంచడం ద్వారా భూమి సారవంతమవుతుందన్నారు. పలు రకాల పంటలు వేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయంతోపాటు పురుగు, తెగులు ఉధృతి తగ్గుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో పురుగు, తెగులు నివారణకు సహజంగా లభించే కషాయాలను ఉపయోగించాలని సూచించారు. ప్రతి ఒక్క రైతు వ్యవసాయంలో పశువులను అనుసంధానం చేసుకోవాలని తెలిపారు. దేశీ విత్తనాలను ఉపయోగించడం వలన పురుగు, తెగులు ఉధృతి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకామయ్మ మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ప్రతి మహిళా తప్పనిసరిగా కిచెన్ గార్డెన్స్ వేసుకునేలా అవగాహన కల్పిస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడానికి అవసరమైన ఆర్థిక సహాయం మహిళా సమాఖ్య నుంచి రైతులకు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతు బి.ఈశ్వరరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోనంకిలో పట్టపగలే చోరీ

రూ.5 లక్షలు విలువైన నగలు, నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

మార్టూరు: మండలంలోని జాతీయ రహదారి పక్కన గల కోనంకి గ్రామం మెయిన్ సెంటర్లో సోమవారం సాయంత్రం ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో భారీ చోరీ జరిగింది. అందిన వివరాల మేరకు.. కోనంకికి చెందిన తవ్వా వాసుదేవరావు మండలంలోని తాటివారిపాలెం గ్రామంలోనూ, ఆయన భార్య వెంకట శ్యామలా దేవి మండలంలోని బొల్లాపల్లి గ్రామంలోనూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. సాయంత్రం నాలుగున్నర గంటలకు ముందుగా ఇంటికి వచ్చిన వెంకట శ్యామలా దేవి తమ ఇంటి ముందు ద్వారం తలుపు తాళం పగులగొట్టి ఉండటం గమనించి భర్తకు, తరువాత పోలీసులకు సమాచారం అందించారు. సీఐ పీ.అక్కేశ్వరరావు, ఎస్సై శ్రీనివాసరావు చోరీ జరిగిన ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. బెడ్ రూమ్‌లో ఉన్న బీరువాలో దాచి ఉంచిన సుమారు 7 కిలోల వెండి, 8 గ్రాముల బంగారు చైను, రూ.50 వేల నగదు చోరీకి గురైనట్లు ఉపాధ్యాయుడు వాసుదేవరావు పోలీసులకు తెలిపారు. పోలీసులు ఒంగోలు నుంచి వచ్చిన క్లూస్ టీం ద్వారా రాత్రి 8 గంటల ప్రాంతంలో చోరీ జరిగిన నివాసంలో వేలిముద్రలు ఇతర ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓవరాల్ చాంప్ ఎన్టీఆర్ పశువైద్య కళాశాల

గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలలో జరుగుతున్న శ్రీవేంకటేశ్వర పశువైద్య విద్యాలయం 12వ అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఎన్టీఆర్ పశువైద్య కళాశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించింది. బాలుర విభాగంలో క్రీడలు, సాంస్కృతిక, లిటరరీ చాంపియన్‌షిప్‌ను కూడా ఇదే కళాశాల దక్కించుకుంది. బాలికల విభాగంలో చాంపియన్‌షిప్‌ను ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల కైవసం చేసుకుంది. అథ్లెటిక్స్ వ్యక్తిగత చాంపియన్‌గా తిరుపతి కళాశాలకు చెందిన ఆర్‌ఎస్ జ్ఞానేశ్వర్, బాలికల విభాగంలో ప్రొద్దుటూరు కళాశాలకు చెందిన ఎం. సాయితేజస్వి నిలిచారు. అనంతరం విజేతలుగా నిలిచిన జట్లకు, క్రీడాకారులకు విశ్వవిద్యాలయ స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ డాక్టర్ జేవీ రమణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అంతర్ కళాశాలల పోటీలను విజయవంతంగా నిర్వహించిన అధ్యాపకులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను విశ్వవిద్యాలయం పరిధిలో జరిగే పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.వి.ఎస్.కిషోర్ పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామని రూ.14లక్షలు కాజేశారు

- జిల్లా పోలీసు స్పందనలో ఫిర్యాదు
- బాధితుల సమస్యలు ఆలకించిన ఎస్పీ



స్పందనలో జిల్లా ఎస్పీకి సమస్య వివరిస్తున్న వృద్ధురాలు

నరసరావుపేట: ఉద్యోగం ఇప్పిస్తామని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ప్రిన్సిపల్, ఆమె భర్త తన వద్ద రూ.14లక్షలు తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా డబ్బులు అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుని డబ్బులు ఇప్పించాలని అచ్చంపేట మండలం పెదపాలెం గ్రామానికి చెందిన నయావత్ మురళీకృష్ణ నాయక్ జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటికి మొదటి ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్‌కె చంద్రశేఖర్, డీఎస్పీలు కేవీ మహేష్, బి.ఆదినారాయణ, కె.పల్లపురాజు, యు.రవిచంద్ర, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలు తోలుకొని వెళ్లి డబ్బులు ఇవ్వట్లేదు

నా వద్ద 24 గొర్రెలు ఉండగా గ్రామానికి చెందిన వ్యక్తి రూ.3లక్షలకు కొనుగోలు చేసి నెలలోపు డబ్బులు ఇస్తానని చెప్పి తోలుకుని వెళ్లాడు. గడువు ముగిసినా డబ్బులు ఇవ్వలేదు. అడిగితే బెదిరిస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకొని నా డబ్బులు నాకు ఇప్పించండి.

–ముంద్రు పెదపిచ్చయ్య, మతుకుమల్లి, శావల్యాపురం

విదేశాలకు పంపుతానని రూ.15లక్షలు తీసుకున్నారు..

నా కుమారుడిని విదేశాలకు పంపేందుకు పిడుగురాళ్లకు చెందిన వ్యక్తి రూ.15లక్షలు తీసుకున్నాడు. ఆ పని చేయకుండా డబ్బులు తిరిగి ఇవ్వకుండా, ఎటువంటి సమాధానం చెప్పకుండా తిరుగుతున్నాడని, ఆ డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

– శ్రీనివాసరావు, గుత్తికొండ, పిడుగురాళ్ల మండలం

ఈఎంఐలు చెల్లించేలా చేయండి

నాకు వరవకట్టలో సొంత ఇల్లు ఉండగా అందులో నివాసం ఉంటున్నా. నా పేరుపై ఉన్న ఇంటిని నా కుమారుడు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో తాకట్టు పెట్టి రూ.13లక్షలు తీసుకున్నాడు. వారికి చెల్లించాల్సిన నెలవారీ ఈఎంఐలు చెల్లించకపోవటంతో వారు ఇంటిని ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారు. ఇల్లు ఖాళీచేస్తే నేను రోడ్డుపైనే ఉండాలి. అందువలన నా కుమారుడు ఈఎంఐలు చెల్లించేలా చర్యలు తీసుకోండి.

–చల్లా పిచ్చమ్మ, వరవకట్ట, నరసరావుపేట

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ క్రికెట్ జట్టు ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల క్రికెట్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరి డాక్టర్ ఇ.త్రిమూర్తి సోమవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా కె.వి.అభిషేక్, ఆర్.పూర్ణచందర్, వై.గౌతమ్, జి.ప్రవీణ్‌కుమార్, జి.శివనిరంజన్‌రెడ్డి, ఎస్.అన్వేష్‌బాబు, సి.హెచ్.రాజేష్, ఎన్.నితిన్, ఎ.బి.రక్షిత్, ఎం.లిఖిత్, పి.సునీల్‌కుమార్, షేక్ కుతుబ్, ఎం.సాయి షణ్ముఖ్, వి.సాయిచందు, సచిన్ చౌదరి, కె.ఎన్.పి.ఎస్.రామకృష్ణ ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల పది నుంచి 16వ తేదీ వరకు చెన్నైలోని హిందుస్తాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీలో జరిగే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని వివరించారు. జట్టు బృందాన్ని వర్సిటీ ప్రాంగణంలో వీసీ డాక్టర్ కె.బాబ్జి, రిజిస్ట్రార్ వి.రాధికా రెడ్డి అభినందించారు.

ఆర్థిక స్వావలంబనకు విస్తృత కార్యక్రమాలు

మెప్మా డైరెక్టర్ విజయలక్ష్మి



మాట్లాడుతున్న మెప్మా డైరెక్టర్ విజయలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: పేద, మధ్య తరగతి మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విస్తృత రీతిలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) డైరెక్టర్ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో మెప్మా కార్యక్రమాల పురోగతితో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రాంతీయస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ జీవనోపాధి మెరుగుపడే విధంగా స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) మహిళలకు శిక్షణ కల్పించాలని జిల్లాల వారీగా ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేవిధంగా పట్టణాల్లో మహిళా మార్ట్‌లు, జగనన్న మార్ట్‌లు, పట్టణ ప్రగతి యూనిట్లతో పాటు ఆహార క్యాంటీన్లు, అర్బన్ మార్కెట్లు, చేయూత జీవనోపాధి యూనిట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సంబంధిత మార్ట్‌లతో పాటు యూనిట్లను డ్వాక్రా మహిళలే నిర్వహించుకునే విధంగా తగు శిక్షణ కల్పించాలని సూచించారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు పంచసూత్రాలు పాటించేలా సరైన శిక్షణ ఇప్పించి, ప్రతి మహిళా సంఘం బలోపేతమయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మెప్మా ద్వారా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు పట్టణ స్థాయిలో మహిళలకు చేరేలా పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ఉమ్మడి గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల వారీగా మెప్మా కార్యక్రమాల ప్రగతిపై సమీక్షించారు. సమావేశంలో మెప్మా గుంటూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లు పి.వెంకట నారాయణ, ఐమ్మానుయేలు, టి.రవికుమార్, రాష్ట్ర కార్యాలయ ఏఓ రామాంజనేయులు, సబ్జెక్టు స్పెషలిస్టులు, రాష్ట్ర, నగర మిషన్ మేనేజర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

20న క్యారమ్స్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): రాష్ట్ర క్యారమ్స్ సంఘం పర్యవేక్షణలో ఈ నెల 20న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి బాల బాలికల జూనియర్ క్యారమ్స్ పోటీలు జరుగుతాయని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా క్యారమ్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు సంబంధించిన మరిన్ని వివరాలకు, పేర్లు నమోదుకు జె.మురళీ కృష్ణ సెల్ నెంబర్ 91774 79119 నంబరులో సంప్రదించాలన్నారు.

ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘ గౌరవాధ్యక్షుడిగా గంగాధర్

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు ట్రాన్స్‌ఫోర్ట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌ఆర్‌టీసీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా దుగ్గి గంగాధర్ ఎన్నికయ్యారు.
సోమవారం విజయవాడలోని ఒక హోటల్‌లో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.రవి, ఎజ్రా శాస్త్రి మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరా లుగా తమ అసోసియేషన్‌కు ఎంతగానో సహాయ సహకారాలు అందిస్తున్నందుకు మరలా గంగాధర్‌ను గౌరవాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు గంగాధర్‌ను ఘనంగా సత్కరించారు.
అనంతరం గంగాధర్ మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడమే కాకుండా ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రికి అందరూ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అడిషనల్ ప్రధాన కార్యదర్శి ఉ.థామస్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.యాకోబు, ట్రెజరర్ ఉమామహేశ్వరరావు, కార్యదర్శి టి.నారాయణస్వామి, ఉపాధ్యక్షుడు సి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

భవానీ దీక్షల విరమణ దిగ్విజయం

- 5 రోజుల్లో 3.50 లక్షల మంది భవానీల రాక
- మరో లక్ష మందికిపైగా సాధారణ భక్తులు
- 15.25 లక్షలకుపైగా లడ్డూల విక్రయం



దీక్షల విరమణకు తరలివచ్చిన భవానీ మాలధారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహించిన భవానీ దీక్షల విరమణ మహోత్సవాలు దిగ్విజయంగా పూర్తయ్యాయి. ఈ నెల మూడో తేదీన ప్రారంభమైన ఉత్సవాలు ఏడో తేదీ వరకు కొనసాగాయి. ఐదు రోజుల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి 3.50 లక్షల మంది భవానీ మాలధారులు తరలివచ్చి దుర్గమ్మను దర్శించుకుని ఇరుముడులు సమర్పించి, దీక్షలు విరమించారు. ఈ ఐదు రోజుల్లో భవానీలతో పాటు మరో లక్ష మందికి పైగా సాధారణ భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొనడంతో పాటు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారుల అంచనా.

21 గంటల పాటు అమ్మవారి దర్శనం

భవానీ దీక్షల విరమణ మహోత్సవాలను పురస్కరించుకుని రోజూ 21 గంటల పాటు భక్తులకు దుర్గమ్మ దర్శనాన్ని ఆలయ అధికారులు కల్పించారు. గతంలో తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనం ప్రారంభయ్యేది. మూడేళ్లగా అర్ధరాత్రి ఒంటి గంటకే అమ్మవారి ఆలయం తెరిచి నిత్య పూజలు నిర్వహించిన అనంతరం దర్శనానికి భవానీలను అనుమతిస్తున్నారు. రాత్రి 11 గంటల వరకు దర్శనం కొనసాగేది. మధ్యలో అర్ధగంట పాటు అమ్మవారికి మహా నివేదన, సాయంత్రం ఆరు గంటలకు అమ్మవారికి పంచహారతుల సేవ నిమిత్తం మరో అర్ధగంట పాటు దర్శనం నిలిపేవారు. ఇక మిగిలిన సమయంలో భవానీలకు ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా అమ్మవారి దర్శనం కల్పించేవారు. భవానీలకు అమ్మవారి దర్శనంలో కల్పించడంలో ఆలయ ఏఈఓ స్థాయి అధికారి పర్యవేక్షణలో సూపరింటెండెంట్, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది నిరంతరం సేవలు అందించారు.

భక్తులకు కోరినన్ని లడ్డూలు

దీక్షల విరమణకు విచ్చేసే భవానీలకు లడ్డూల కొరత రాకుండా చేయాలని ఈఓ కె.ఎస్.రామారావు సిబ్బందికి పదే పదే సూచించారు. దసరా ఉత్సవాల్లో ఏ విధంగా అయితే భవానీలకు లడ్డూలను అందించారో అదే ప్రణాళిక ప్రకారం లడ్డూలను తయారు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిత్యం లడ్డూలు తయారు చేసే పోటుతో పాటు కనకదుర్గనగర్‌లోని షెడ్డులో మరో పోటును ఏర్పాటు చేశారు. భవానీల సౌలభ్యం కోసం ఒక కవర్‌లో పది లడ్డూలను ప్యాకింగ్ చేయడంతో పాటు సింగిల్ లడ్డూ ప్యాకింగ్ చేసి అందుబాటులో ఉంచారు. కనకదుర్గనగర్‌లో 11 కౌంటర్లు, ఘాట్‌రోడ్డులో ఒక కౌంటర్, రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో మరో రెండు కౌంటర్లను అందుబాటులో ఉంచారు. ఈ కౌంటర్లు 24 గంటలూ నిరంతరాయంగా పనిచేశాయి. అమ్మవారి దర్శనం ఎప్పుడు చేసుకున్నా భవానీలు ఎటువంటి ఇబ్బంది లేకుండా తమకు కావాల్సినని లడ్డూలను కొనుగోలు చేసుకున్నారు. మొత్తంగా ఐదు రోజుల్లో 15.25 లక్షల లడ్డూలను విక్రయించినట్లు దేవస్థాన అధికారులు వెల్లడించారు.

అల్పాహారం, అన్నప్రసాద వితరణ

భవానీ దీక్ష విరమణలకు విచ్చేసే భవానీల కోసం దేవస్థానం తెల్లవారుజాము ఆరు నుంచి రాత్రి 11 గంటల వరకు నిరంతరం ఉచిత ప్రసాద వితరణ, అల్పాహారం, అన్న ప్రసాదాల వితరణ చేసింది. ఉదయం టమాటా బాత్, దద్దోదనం, పులిహోరతో పాటు సాయంత్రం ఇదే మెనూను అమలు చేసేవారు. ఇక ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అన్నప్రసాద వితరణ జరిగింది.

ఏర్పాట్లు యథాతథం

ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ ఆదివారంతో ముగిసినా సోమవారం ఏర్పాట్లు యథాతథంగా కొనసాగాయి. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులు టోల్‌గేట్ వద్ద నుంచి క్యూలైన్‌లోకి ప్రవేశించి కొండపైకి చేరుకున్నారు. కొండపైకి ద్విచక్ర వాహనాలు మినహా ఇతర వాహనాలను అనుమతించలేదు. మరో వైపున మహా మండపం లిఫ్టు ద్వారా వృద్ధులు, వికలాంగులు, రూ.500 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులను అనుమతించారు. ఐదు రోజుల దీక్షల విరమణ ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి దర్శనం చేసుకోలేని సాధారణ భక్తులు సోమవారం పెద్ద ఎత్తున ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. అమ్మవారి దర్శనం అనంతరం మహామండపం రెండో అంతస్తులో అన్నప్రసాద వితరణ చేయగా, లడ్డూ ప్రసాదాలను మాత్రం కనకదుర్గనగర్‌లోని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలోనే విక్రయించారు. మంగళవారం నుంచి ఆది దంపతులకు నిర్వహించే అన్ని ఆర్జిత సేవలకు ఉభయదాతలు, భక్తులను అనుమతిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

24 గంటలూ అధికారుల పర్యవేక్షణ

దీక్షల విరమణకు విచ్చేసే భవానీలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూసేందుకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కె.ఎస్.రామారావు నిరంతరం ఏర్పాట్లను పర్యవేక్షించారు. దీక్షల విరమణ ప్రారంభానికి ముందు రోజు సీపీ టి.కె. రాణా నేతృత్వంలో పోలీసులకు పలు సూచనలు చేయడమే కాకుండా ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. కలెక్టర్ ఢిల్లీరావు పలు మార్లు ఏర్పాట్లను పర్యవేక్షించడమే కాకుండా నిరంతరం అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ రద్దీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇక చైర్మన్ రాంబాబు, ఈఓ రామారావు స్నానఘాట్లు, కేశ ఖండనశాల, క్యూలైన్లు, మహా మండపం, హోమ గుండాలు, ఇరుముడి పాయింట్లతో పాటు ఉచిత ప్రసాద వితరణ, లడ్డూ కౌంటర్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడమే కాకుండా ఆలయ సిబ్బందికి సూచనలు చేశారు. అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేయడంతోనే దీక్ష విరమణలు దిగ్విజయంగా పూర్తయ్యాయని చైర్మన్ రాంబాబు, ఈఓ రామారావు తెలిపారు. భవానీ దీక్ష విరమణలు పూర్తి కావడంతో మరో రెండు రోజుల్లో కానుకల లెక్కింపు జరుగుతుందని ఆలయ అధికారులు పేర్కొన్నారు.